టిడిపి హయాంలోనే అభివృద్ధి : షరీఫ్

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంతాలు టిడిపి అధికారంలో ఉన్నప్పుడే అభివృద్ధి చెందాయని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. గురువారం సాయంత్రం మొగల్తూరులోని ఆదర్శనగర్ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారులు, వంతెనలు తదితర అభివృద్ధి పనులు టిడిపి హయాంలోనే జరిగాయన్నారు. నరసాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ వైసిపి రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. నియోజకవర్గ నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ గ్రామాలు టిడిపి హయాంలోనే అభివృద్ధి చెందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లాటి భోగరాజు, పొన్నపల్లి శివ, డోల్లా రత్నంరాజు, జోగి పండు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కొల్లాటి బాలకృష్ణ, పాల గోపాలం పాల్గొన్నారు

1153 రకం ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

రైతులతో కలిసి ఉద్యమిస్తాం : ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

1153 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధాన్యంతో రైతులు ఆందోళన చేపట్టారు. దొడ్డనపూడి గ్రామ రైతులు సుమారు 60 ఎకరాల్లో ఎంటియు 1153 రకాన్ని సాగుచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇ పంటలో నమోదు చేశారు. అయితే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ ఐకెపిల చుట్టూ కాళ్ల అరిగేలా తిరిగినా ఫలితం లేదు. 1153 రకాన్ని కొనుగోలు చేయబోమని అధికారులు సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మూడు గంటలపాటు ధర్నా చేపట్టామని రైతులు కొప్పర్తి శివాజీ, కుంకుళ్ల ప్రసాద్, వీస్సాకోడేటి సుబ్బయ్య, గుండా పెద్దిరాజు, కొల్లి అన్నవరం, వెలివెల సురేష్ తెలిపారు. ధర్నాకు ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, మాజీ సర్పంచి బండారు వేణుగోపాలరావు, మాజీ ఎంపిటిసి ఆరేటి గాంధీ, పుప్పాల వాసు, కొల్లి శ్రీనివాస్ మద్దతు తెలిపి కూర్చున్నారు. అనంతరం ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ 1153 రకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రైతు ఉద్యమాలు చేపట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్‌డిఒ దాసి రాజు, రైస్ మిల్లర్ల దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ కృష్ణారావు, ఎఒ సిహెచ్.జయవాసుకితో ధాన్యాన్నికి మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ఆర్‌డిఒ హుటాహుటీన తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి రైతులు, ఎంఎల్ఎతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 1153 ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తానన్నారు. ఆర్‌డిఒ 1153 రకాన్ని ఎక్కువగా ఆరబెట్టొద్దని, అలా ఆరబెడితే బియ్యం ముక్కలవుతుందని చెప్పారు. 17 శాతం తేమ ఉంటే వాటిని కొనుగోలు చేసేలా శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీంతో దీంతో రైతులు ధర్నాను విరమించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధాన్యంతో ఆందోళన చేస్తున్న రైతులు

భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు ప్రయత్నం చేయడం ద్వారా మంచి సమాజం ఏర్పరచుకోవచ్చునని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గంగా జలాలను దివి నుండి భూమికి తీసుకొచ్చిన ఘనత భగీరథుడికే దక్కుతుందని అన్నారు. కష్ట సాధ్యమైన పనిని సాధించాలంటే భగీరథుని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. డిఆర్ఒ కె.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని అది ఎంత కష్టమైనా సాధించే విధంగా ముందుకెళ్లడమే భగీరథుని ప్రయత్నం అంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.గణపతిరావు, జిల్లా అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెన్షనర్స్ అసోసియేషన్ కారాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - భీమవరం

పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి నాయకత్వం పోరాటంలో భాగంగా గురువారం భీమవరం పెన్షనర్స్ కార్యాలయంలో పెన్షనర్లతో జెఎసి నాయకులు సమావేశం అయ్యారు. అనంతరం కార్యాలయం ఎదుట ఉద్యోగులు, పెన్షనర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణమోహన్ మాట్లాడారు. ప్రస్తుతం ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దశల వారీ పోరాటానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పెండింగ్ డిఎలు మంజూరు చేయాలని, డిఎ, ఎరియర్స్, పిఆర్‌సి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. రెండు దశల పోరాటాల్లో పెన్షనర్స్ పూర్తి సహాయ సహకారాలు అందజేశారని, భవిష్యత్ పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా కార్యదర్శి కె.ఫణికుమార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ఎన్.రాజు, కోశాధికారి రవిప్రసాద్, భీమవరం కార్యదర్శి సీతారామరాజు, పెన్షనర్స్ సత్యనారాయణ రాజు, సుబ్బారావు, అప్పలరాజు, భాస్కరరావు, చంద్రరావు, ముత్యాలరావు, జయరాజు, ఆంజనేయులు, రామారావు, చాన్ భాషా పాల్గొన్నారు.

దీక్షల్లో కూర్చున్న యూనియన్ నేతలు, కార్మికులు

వీరవాసరం సొసైటీ ఛైర్ పర్సన్‌గా గౌరి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

సామాజిక పరంగా అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడమే భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఉద్దేశమని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. వీరవాసరం సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్ పర్సన్‌గా కొలుపూడి గౌరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ ఒక సామాజిక వర్గంలో ఒక వ్యక్తికి పదవి కేటాయించలేదని తన సామాజిక వర్గానికి ప్రాధాన్యతలేదంటూ వాఖ్యానించడం సరైన విధానం కాదన్నారు. గతంలో ఏ నాయకుడూ చేయని విధంగా ఎంఎల్ఎ అన్ని వర్గాలకూ ప్రాధాన్యతిస్తున్నారని తెలిపారు. అండలూరు సహకార సంఘం ఛైర్మన్‌గా ఒక ఎస్‌సి సామాజిక వర్గానికి, వీరవాసరం సొసైటీకి ఒక బిసి మహిళకు అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా టిడిపిలో ఉన్నప్పుడు తనకు దక్కని అవకాశం వైసిపిలోకి వచ్చిన తరువాత గ్రంధి శ్రీనివాస్ ఎఎంసి డైరెక్టర్‌గా అవకాశం కల్పించారని మతల కాశీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఛైర్ పర్సన్‌కు సహకారం అందిస్తామని పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ వర్ధినీడి శ్రీనివాస్, సర్పంచి చికిలే మంగతాయారు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, అండలూరు సొసైటీ ఛైర్మన్ మానుకొండ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుమదంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

పెనుమదంలో పలు అభివృద్ధి పనులను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక స్నాన ఘట్టం, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన బిసి కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధి చేస్తున్న ఏకైక నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, ఉప సర్పంచి పితాని చిన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్మన్

8వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్‌లో టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ, కార్యదర్శి జి. త్రిమూర్తులు గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి సీడ్స్ యూనిట్‌లో 52 సంవత్సరాలుగా హమాలీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికుల హక్కులు రక్షించాల్సిన ప్రభుత్వం, అధికారులు చట్ట విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. పాత పద్ధతిలో కొనసాగించాలని, కార్మికుల పై రాజకీయ వేధింపులు ఆపాలని, న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, సత్యనారాయణ, సాంబశివరావు, సూరిబాబు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మేడే స్ఫూర్తితో తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేడే ఏర్పాట్లపై విస్తృత సమావేశం సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎస్.సిరీస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని మూసివేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్న మోడీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. సిఐటియు భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ మే 1న జరగనున్న సభలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, పిన్నింటి శ్రీను, నీలాపు రాజు, మెడికల్ రిప్స్ శ్రీనివాసరావు, పి.కృష్ణ, మావుళ్ల పి.సంసోను, టి.రాంబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : మేడేను విజయవంతం చేయాలని రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. రైస్ మిల్ యూనియన్ నాయకుడు బొర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన సిఐటియు మండల కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలన్నారు. కార్మికులకు పని భద్రత, ఉద్యోగ భద్రత, జీవన భద్రత లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఐక్య ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, బుర్ర సత్యం, ముద్దే లక్ష్మయ్య, పైలా శ్రీనివాసరావు, ఎం.నాగమ్మ పాల్గొన్నారు.

సాయిాస్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

జిల్లాకు చేరిన సాయిాష్ భౌతికకాయం

నేడు పాలకొల్లులో అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, స్పోర్ట్స్

ఈ నెల 20న అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థి వీరా సాయిాష్ మృతదేహం గురువారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన సాయిాష్ అమెరికాలోని ఓహెయో రాష్ట్రంలోని క్లీన్‌ల్యాండ్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతూ ఉపాధి కోసం గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లో చేరాడు. ఈ నెల 20న ఫిల్లింగ్ స్టేషన్లో దోపిడీకి వచ్చిన దుండగుడు జరిపిన కాల్పుల్లో సాయిాస్ అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల జోక్యం, ప్రభుత్వ చొరవతో అన్ని లాంఛనాలు పూర్తి త్వరితగతిన పూర్తి చేయడంతో సాయిాష్ మృతదేహం గురువారం ఉదయం హైదరాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్‌లో గురువారం సాయంత్రానికి ఏలూరు అశోక్‌నగర్‌లోని స్వగృహానికి తరలించారు. తల్లి జయశ్రీ రోదించిన తీరు అక్కడ అందర్నీ కంటతడి పెట్టించింది. చింటూ చింటూ అంటూ ఆమె గుండె పగిలేలా రోదిస్తుంటే ఆ ప్రాంతమంతా తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సోదరుడు వెంకటేష్, బంధువుల ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఇంకెవరూ తమ పిల్లలను అమెరికా పంపొద్దు అంటూ ఆ తల్లి రోదించడం చర్చనీయాంశమైంది. అనంతరం సాయిాష్ భౌతికకాయాన్ని అతని తండ్రి స్వగ్రామమైన పాలకొల్లు తరలించారు. శుక్రవారం ఉదయం పాలకొల్లులో సాయిాస్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరఫున ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్ అన్ని ఏర్పాట్లనూ పర్యవేక్షించారు. ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు, ఉద్యోగ సంఘ నాయకులు హరినాథ్, చోడగిరి శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యదర్శి బి.ఎ.సాల్మన్‌రాజు అన్నారు. ఫ్యాప్టో జిల్లా సబ్ కమిటీ సమావేశం భీమవరంలో జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఫ్యాప్టో రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. అనేక రకాల యాప్‌లతో చదువుకు దూరం చేస్తోందన్నారు. తనిఖీల పేరుతో భయానక వాతావరణం సృష్టిస్తోందని,తక్షణం ఈ చర్యలు విరమించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రకాశం మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలను, ప్రమోషన్లు జరిపించాలని, అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకూ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, ప్రతి హైస్కూల్‌కూ అన్ని సబ్జెక్టులకూ టీచర్లు ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు పిఎన్‌వి.ప్రసాద్, రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజగోపాల్, జిల్లా సబ్ కమిటీ మెంబర్లు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు

నిస్వార్థ ప్రజా సేవకుడు పెనుమత్స శ్రీనివాసరాజు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు



గుర్రం బండిపై ర్యాలీగా వెళ్తున్న డిసిసిబి ఛైర్మన్, ఎంపిపి, సర్పంచి, మాజీ సర్పంచి

ప్రజాశక్తి - పాలకోడేరు

అడిగిన వారికి లేదనుకుండా సాయం అందించే గొప్ప నిస్వార్థ ప్రజాసేవకుడు, విస్సాకోడేరు మాజీ సర్పంచి, వైసిపి ముఖ్యనేత పెనుమత్స శ్రీనివాసరాజు (శ్రీను రాజు) అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు తెలిపారు. విస్సాకోడేరు 14వ వార్డు రెడ్లపాలెంలో మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు ఆర్థిక సహకారంతో ఆధునికీకరించిన కోదండ రామస్వామి ఆలయ 9వ వార్షిక కళ్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), సర్పంచి బొల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు, వైసిపి ముఖ్యనేత దుండి అశోక్‌బాబు విచ్చేశారు. స్థానిక రావిచెట్టు సెంటర్ నుంచి గుర్రం బండిలో ముఖ్యఅతిథులతో ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సర్పంచి బొల్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మాజీ సర్పంచి శ్రీనివాసరాజు రామాలయాన్ని ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు సాయం అడిగితే కాదనకుండా ఏమీ ఆలోచించకుండా సాయం చేసే గొప్ప వ్యక్తి శ్రీనివాసరాజు అన్నారు. ఇటువంటి స్వభావం కలిగిన వారు సమాజంలో ఎవరోగానీ ఉండాలని చెప్పారు. స్థానికంగా నిర్మించిన కమ్యూనిటీ హాలు ఆధునికీకరణకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అనంతరం పివిఎల్‌కు జ్ఞాపికను అందజేసి గజమాలతో సత్కరించారు. ఆలయ ఆధునికీకరణకు ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచి శ్రీనివాసరాజు, ఆయన కుమారుడు ఆదిత్యవర్మను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిపి చంటిరాజు, సర్పంచి శ్రీనివాస్, వైసిపి ముఖ్యనేత అశోక్‌బాబుతోపాటు సుమారు 70 మందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కందుల నాగరాజు, ఎంపిటిసిలు పెదపూడి లక్ష్మీపతి, బొల్లం గాంధీ, కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, ఆలయ కమిటీ సభ్యులు పెరుమాల వీరన్న, పేరం శ్రీనివాస్, సల్లా వెంకయ్య, పెరుమాళ్ల కోటేశ్వరరావు, కడారి దుర్గారావు, వైసిపి నేతలు కలిదిండి కృష్ణంరాజు, పిన్నమరాజు సహదేవరాజు, పిన్నమరాజు పద్మరాజు, చెల్లబోయిన పాపారావు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గోపాల కృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, సర్పంచులు జంగం సూరిబాబు, ఇంజేటి మరియమ్మ, కడలి నాగేశ్వరి, చింతపల్లి వెంకటసత్యనారాయణ, ఎంపిటిసిలు ఆదాడ లక్ష్మీ తులసి, నరేష్, నాగలక్ష్మి, పాలా జ్యోతి, షేక్ పాపాసాహెబ్, సొసైటీ ఛైర్మన్ గడ్డం జోషి, మాజీ ఛైర్మన్ చేబోలు బాలాజీ, చందు, చుండూరి అంజిబాబు, తుల చంద్రరావు పాల్గొన్నారు.



శ్రీనివాసరాజు, ఆయన కుమారుడు ఆదిత్యను సత్కరిస్తున్న ఆలయ కమిటీ, గ్రామస్తులు

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ పేదల ఉపాధికి ఎంతోకొంత ఉపయోగపడుతున్న చట్టం ఉపాధి హామీ అన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, వామపక్షాల ఒత్తిడి వల్ల గ్రామీణ పేదలకు ఈ చట్టాన్ని సాధించామన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని పూర్తిగా నీరుగార్చాలని, రద్దు చేయాలని చూస్తోందన్నారు. ఈ చట్టానికి ఎలాంటి కోతలు లేకుండా అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో కనీసం 200 పని దినాలు కల్పించాలని, వేతనం రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. చాలా చోట్ల వేతనం రూ.125 లేదా రూ.150 మాత్రమే అందుతోందన్నారు. ఇటీవల ఒక పూట కాకుండా రెండు పూట్లా మస్టర్ వేయాలనడం దారుణమన్నారు. దాన్ని రద్దు చేయాలనానరు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, వైద్య సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. పనికి అవసరమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో కూడా ఈ చట్టాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పనుల కోసం, బకాయిల చెల్లింపుల కోసం వారు చేస్తున్న ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న బలరాం

వాసవీ విద్యార్థుల విజయభేరి

జ్యోత్స్న

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంటర్ ఫలితాల్లో వాసవీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్లో జి.ప్రసన్నలక్ష్మీ 427 మార్కులు, పి.కీర్తి దివ్య జ్యోతి 419 మార్కులు, జి.వంశీ 412, ఐ.నాగ శ్రీహరిక 408 మార్కులు, పి.సత్యశ్రీ 401 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్లో జి.జ్యోత్స్న 920 మార్కులు, కె.ప్రసాద రెడ్డి 915 మార్కులు, ఎం.స్వర్ణలత 906 మార్కులు సాధించి కాలేజీ టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎన్‌వి.రమణారావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మండా బ్రహ్మజీ, ట్రెజరర్ ఆలపాటి బోస్ అభినందించారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని ఉప్పరగూడెంలో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఉదయం ఐదున్నరకు వచ్చి పని ప్రారంభిస్తున్న తమకు సరైన కూలీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇచ్చిన మాదిరిగానే సమ్మర్ అలవెన్స్ యథావిధిగా ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ కూలీలు వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్నారని, ఇప్పటివరకు ఇస్తున్న సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం దారుణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.గోతియ్య, నత్త రాధా, మరపట్ల వెంకట్రావు, కప్పల మేరీకుమారి మాట్లాడారు.

ఇబిసి నేస్తం అగ్రవర్ణ పేదల పాలిట వరం

ప్రజాశక్తి - ఆచంట

ఇబిసి నేస్తం అగ్రవర్ణ పేదల పాలిట వరమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి రైతు కమ్యూనిటీ హాల్లో ఇబిసి నేస్తం లబ్ధిదారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా అగ్రవర్ణ పేదలకు ప్రత్యేక పథకం ఏర్పాటు చేసి వారిని ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కొడమంచిలిలో67 మందికి రూ.8.45 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హినా భాను, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు డానియేలు, రాజ్ కమల్, రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులు తేమ శాతాన్ని పరిశీలించాలి

ప్రజాశక్తి - అత్తిలి

రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులు తమ పంట తేమ శాతాన్ని తప్పకుండా పరిశీలించుకోవాలని తహశీల్దార్ ఎవి రామాంజనేయులు అన్నారు. గురువారం బల్లిపాడు, వరిఘేడు రైతు భరోసా కేంద్రాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతూ తేమ శాతాన్ని తప్పనిసరిగా నమోదు చేసుకుని, ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయాలు వెంటనే చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎఒ టికె.రాజేష్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోనె సంచుల సరఫరాలో విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

రబీలో ధాన్యం పట్టుబడికి రైతులకు తగిన గోనె సంచులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ అధికారులు విఫలమయ్యారని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాయకులు, అధికారులు చెబుతుంటారని, కానీ వారి గోడు పట్టించుకునే నాధుడే లేడని విమర్శించారు. గత ఖరీఫ్‌లో కావాల్సిన గోనెసంచులు అందుబాటులో లేక నానా అవస్థలు పడ్డారని తెలిపారు. రబీలో నైనా అధికారులు మేల్కొనకుండా ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో ధాన్యం పట్టుబడికి సుమారు 10 లక్షల వరకూ గోనె సంచులు అవసరం కాగా, పౌరసరఫరాల శాఖ అధికారులు కేవలం మూడు లక్షల 50 వేల సంచులు మాత్రమే రైతులకు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం తెలుస్తోందన్నారు. తక్షనం గోనే సంచులు అందుబాటులో ఉంచాలని కోరారు.

బాధితురాలికి వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు మండలం కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శాంతికుమారి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయాన్ని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ద్వారా ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సిద్ధాంతం సర్పంచికి సత్కారం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం సర్పంచి చింతపల్లి గనిరాజును ఘనంగా సన్మానించారు. పంచాయతీకి జిల్లాస్థాయిలో సామాజిక భద్రత అవార్డు రావడంతో సర్పంచి గనిరాజును సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పంచాయతీ ఆవరణలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

చెరుకువాడలో ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ పర్యటన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ గ్రామంలోని నూతి గట్టు ప్రాంతంలో కూల్చివేసిన ప్రార్థనా మందిరం వివాదం నేపథ్యంలో గురువారం ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ వీరమల్లు రెడ్డియ్య పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డియ్య మాట్లాడుతూ వివాదాస్పదమైన ప్రార్థన మందిరం విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, ప్రార్థన మందిరం నిర్వాహకులు కన్నీడి హేమకుమార్ నుంచి వేర్వేరుగా వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఈ అంశంపై ఒక నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన వివరించారు.

పాఠశాలల సోషల్ ఆడిట్ పై శిక్షణ

ప్రజాశక్తి - వీరవాసరం

పాఠశాలల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై పేరెంట్స్ కమిటీ సభ్యులందరు అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ బి.వినాయకుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ప్రభామంజిరి, కె.వీరస్వామి, బి.శ్రీనివాసరావు, విఆర్ఎస్ సర్కార్ పాల్గొన్నారు.

భర్త కొట్టాడంటూ ఫిర్యాదు

పాలకోడేరు : కుటుంబ గొడవల నేపథ్యంలో తన భర్త యు.శ్రీకాంత్ తనను కొట్టాడంటూ భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి తన భార్య ప్రశాంతి బంధువు భాస్కరరావు తనపై దాడి చేశారంటూ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

పాలకోడేరు : ఇంటి వద్ద నిలుపుదల చేసిన తన ద్విచక్రవాహనం కనిపించడంలేదని గరగపర్రు గ్రామానికి చెందిన డి.శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 24 తేదీ రాత్రి 11 గంటలకు తన ఇంటి ముందు నిలుపుదల చేసిన బైక్ అపహరణకు గురైందని శ్రీను ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

యుకె విద్యార్థుల విజయకేతనం

సిహెచ్ లావణ్య సుప్రియ

కె.కావ్య శ్రీదేవి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించారని ఆంధ్ర అసోసియేషన్ (యుకె) జూనియర్ కాలేజీ ప్రెసిడెంట్ తేతలి గుర్రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో వెయ్యి మార్కులకు గాను కె.కావ్య శ్రీదేవి 959 మార్కులు సాధించి ప్రథమ స్థానం, వి.కుసుమ 939 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను సిహెచ్ లావణ్య సుప్రియ 451 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, నాగశ్రీ వల్లి, ఆర్.రామకిషోర్, ఎస్.తరణీసాయి 449 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తణనంపూడి రామారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.సత్యప్రకాష్, కళాశాల అధ్యాపక బృందం సిబ్బంది అభినందించారు.

గౌతమీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అమృత వర్షిణిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు గౌతమీ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్లో ఎంపిసి విద్యార్థిని పంజా అమృతవర్షిణి 470 మార్కులకు గాను 456 మార్కులు సాధించింది. విద్యార్థినిని ప్రిన్సిపల్ ఏనుగుపల్లి శివకుమార్ గురువారం అభినందించారు. తమ కళాశాలలో 400 మార్కులు కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారు 22 మంది ఉన్నారని తెలిపారు. బైపిసిలో షేక్ సమీరా 412, సిఇసిలో యజ్ఞేష్ 430 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

మండల స్థాయిలో మౌనికకు ప్రథమ స్థానం

పి.మౌనిక

ప్రజాశక్తి - ఉండి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణత సాధించారని, సీనియర్ ఇంటర్లో 50 మంది విద్యార్థులకు గాను 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.నరసింహమూర్తి తెలిపారు. సీనియర్ ఇంటర్లో ఎంపిసిలో పి.మౌనిక 958 మార్కులతో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. సిఇసిలో డివి.లక్ష్మి 899 మార్కులు, హెచ్‌ఇసిలో జి.సంధ్యారాణి 911 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎంపిసిలో ఎల్.యోషిత 410 మార్కులు సాధించినట్లు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

'ఇంపల్స్' విద్యార్థుల హవా

ప్రజాశక్తి - తణుకు

జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఇంపల్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఎంపిసి విభాగంలో ఎం.విమలస్వామి, ఎం.స్టీఫెన్‌పాల్ 470కి గాను 462 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఎస్.సూర్య 460 మార్కులతో ద్వితీయ స్థానం సాధించాడు. సిఇసిలో ఎ.బాల భారతి, పి.హర్యం జైన్ 500 మార్కులకు గాను 471 మార్కులతో తణుకు పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారు. తమ విద్యార్థులు 90 శాతంపైగా ఉత్తీర్ణత సాధించారని కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ కెఎన్‌వి.రామ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకుల కృషి వల్లే ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డి.కేశవరావు, ఎం.రాజేంద్రప్రసాద్. ఎం.సూరిబాబు, ఎం.రవితేజ, అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

చాణక్య విద్యార్థుల విజయదుందుభి

కె.సునీత

బి.లోచిని

ప్రజాశక్తి - గణపవరం

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో గణపవరం చాణక్య కాలేజీ విద్యార్థులు విజయదుందుభి మోగించారని కాలేజీ ప్రిన్సిపల్ అడబాల శ్రీనివాసు గురువారం తెలిపారు. జూనియర్ ఇంటర్లో 85 శాతం మంది విద్యార్థులు, సీనియర్ ఇంటర్లో 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కాలేజీ కరస్పాండెంట్ ఎమ్‌డి సాదత్ ఉస్సేన్, డైరెక్టర్ ముత్యాల వెంకట సత్యనారాయణ అభినందించారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల విజయకేతనం

ప్రజాశక్తి - తణుకురూరల్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ జిహెచ్ హిమబిందు తెలిపారు. జూనియర్ ఇంటర్లో జనరల్ కోర్సుల్లో ఎంపిసి ఇంగ్లీషు మీడియంలో ఆర్.శ్రావణి 453 మార్కులు, బైపిసిలో బి.దుర్గాశ్రావణి 422 మార్కులు, సిఇసిలో బి.పూర్ణిమ 434 మార్కులు సాధించినట్లు తెలిపారు. తెలుగు మీడియంలో కె.సుహాసిని 432 మార్కులు, జూనియర్ ఇంటర్ ఓకేషనల్ కోర్సుల్లో సిఎస్‌ఇలో వి.నవ్య 486 మార్కులు, ఎఅండ్‌టిలో ఎం.రేఖాదేవి 475 మార్కులు, ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లో టి.దేవి 450 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ జనరల్ కోర్సుల్లో ఎంపిసిలో ఆర్.పార్వతి 967 మార్కులు, బైపిసిలో వై.మౌక్తిక 965 మార్కులు, సిఇసిలో టి.వినయదుర్గ 961 మార్కులు, బైపిసి తెలుగు మీడియంలో కె.నీరజసాయి 960 మార్కులు, ఎంఇసి బి.షణ్ముఖేశ్వరి 944 మార్కులు, ఎంపిసి తెలుగులో డి.చూడామణి 948 మార్కులు, హెచ్‌ఇసి తెలుగు మీడియంలో బి.అమీష 920 మార్కులు సాధించారు. ఓకేషనల్ కోర్సుల్లో సిఎస్‌సి కె.మేరీజ్యోతి 979 మార్కులు, ఎఅండ్‌టి కె.సామిజ్యోతి 977 మార్కులు, ఎంపిహెచ్‌డబ్ల్యు జి.సత్యశ్రీ 934 మార్కులు సాధించారు. 400 మంది విద్యార్థినులు 'ఎ' గ్రేడు సాధించగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, కోశాధికారి నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ పి.నరేంద్రబాబు అభినందించారు.

ఆదిత్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి, బైపిసిలో పాలకొల్లు ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎంపిసిలో 470 మార్కులకు పి.గోవర్ధన, ఎన్.జయశ్రీ, కె.భవ్యశ్రీ లక్ష్మి 464 మార్కులు సాధించారు. ఎం.లోకేష్ రామ్, ఎం.అశ్మిత, పిఎస్‌ఎస్.సాయిగణేష్, ఎస్‌ఇవి. రామచరణ్, పి.వినీల 463 మార్కులు సాధించారు. బైపిసిలో 440 మార్కులకు కె.హారిక 427 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో 1000 మార్కులకు పి.రుతుకుమారి 989 మార్కులు, కె.లక్ష్మీదుర్గ 987 మార్కులు, డిఎస్‌ఎస్.సత్యసింధూష 986 మార్కులు, వి.సిరిచందన 983 మార్కులు, చందు సిరిశ్రీ 983 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసిలో వై.హేమదుర్గ శ్రీజ 987 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారికి ఉత్తమ శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి, ఎఒ జి.వాసుబాబు అభినందించారు.

ప్రగతి కాలేజి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఇంటర్ ఫలితాల్లో ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థులు అఖండ విజయాలు సాధించారని విద్యాసంస్థ డైరెక్టర్ ఎంఎస్‌ఆర్ ఆంజనేయులు(రాజా) తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో ఆర్‌ఎస్‌ఎం.పద్మిని 464, పి.అనురాధా 463, మరో ఎనిమిది మందికి 462 మార్కులు వచ్చాయని తెలిపారు. బైపిసిలో బి.దివ్య 435, ఎస్.స్వరూపరాణి 430 మరో నలుగురు 426 మార్కులు సాధించారని తెలిపారు. ఎంఇసిలో ఎస్.శ్రీపద్మావతిదేవి 482, బి.బాపియావంత్ 482 మార్కులు వచ్చాయన్నారు. ఎంపిసిలో 470 మార్కులకు 450 మార్కులు పైగా సాధించిన వారు 83 మంది, బైపిసిలో 440 మార్కులకు 400 మార్కులు పైగా సాధించిన వారు 21 మందితో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో ఎ.హరిప్రియ 988, కె.గీతికా 988, మరో ఐదుగురు 983 మార్కులు సాధించారన్నారు. బైపిసిలో ఎస్‌కె.మంజిబ్ 989, ఎస్‌పిఎన్‌డి మహితా 985, టిజెవి.లావణ్య 983, ఎంఇసిలో టిఎల్‌ఎస్.శరణ్య 974, ఎస్.దేవిశ్రీ 969 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు 900 మార్కులు పైగా సాధించిన వారు 134 మంది 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు విద్యాసంస్థ డైరెక్టర్ ఎంఎస్‌ఆర్.ఆంజనేయులు(రాజా) అభినందనలు తెలిపారు.

ఆకివీడు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆకివీడు

ఈ సారి మండలంలో మూడు కళాశాలలు మండల స్థాయి ప్రథమ స్థానాన్ని పొందాయి. సీనియర్ ఇంటర్‌లో బైపిసిలో వాసవి శారదా జూనియర్ కళాశాల విద్యార్థి కె.హేమలత సాధించగా, ఎంపిసిలో కార్తికేయ జూనియర్ కళాశాల విద్యార్థి కటిరెడ్డి సీతారాం, సిఇసిలో వికాస్ కళాశాల విద్యార్థి పతివాడ గీత ప్రథమ స్థానం సాధించారు. జూనియర్ ఇంటర్‌లో విద్యా వికాస్ విద్యార్థి బుర్ర నందిని మండల ప్రథమ స్థానం సాధించగా, అదే కళాశాలకు చెందిన ఘంటసాల భార్గవి సిఇసిలో ప్రథమ స్థానం సాధించింది. బైపిసి విభాగంలో మండల ప్రథమ స్థానం కార్తికేయ విద్యార్థి సి.జ్యోత్స్న సాధించింది. విద్యా వికాస్ కళాశాల మండల స్థాయిలో మూడు ప్రథమ స్థానాలు సాధించగా, కార్తికేయ రెండు స్థానాలు, వాసవి శారద ఒక స్థానాన్ని సాధించాయి. కేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్‌లో హెచ్ఇసి విభాగంలో 676 మార్కులతో బి.దివ్యకుమారి ప్రథమ స్థానంలో నిలిచింది.

ఆదిత్య విజయ కేతనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంటర్ ఫలితాల్లో తాడేపల్లిగూడెం ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు విజయ కేతనం ఎగరవేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంటర్ సెకండియర్ ఎంపిసి విభాగంలో ఎ.మౌనిక సత్య అనూష 989, బైపిసిలో నల్లజర్ల నవ్యశ్రీ 989, సిఇసిలో సాయికృష్ణ అభిరామిన్ 970, ఎంఇసిలో పి.లీలాకుమార్ 968 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎ.శిరీష నాగ ప్రియ 464, పత్స పుష్పమాధురి 463, నంబూరి శైలేష్ 462, బైపిసిలో మొహమ్మద్ షఫా మేహక్ 429, సిఇసిలో జుత్తిగ వర్ష 444 మార్కులు సాధించారు.

ఉల్లంపర్రు డాక్టర్ సబితా ఉమెన్స్ జూనియర్ కాలేజీ హవా

పాలకొల్లు రూరల్ : ఇంటర్ ఫలితాల్లో ఉల్లంపర్రు డాక్టర్ సబితా ఉమెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని, సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల వాసు తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపిసిలో డి.లీలాభువ నవల్లి 460 మార్కులు, ఎంపిసిలో ఎల్.అఖిలప్రియ 460, ఎస్.సౌమ్య ఎంపిసిలో 457, ఎంఇసిలో డి.ప్రవలిక కుమారి 472, బైపిసిలో ఎస్.సాత్విక 410, బైపిసిలో షేక్.సానియా 400 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసిలో కె.కృష్ణసాయి 949 మార్కులు, ఎంపిసిలో ఎన్.రాజరాజేశ్వరి 946, ఎంఇసిలో బి.భవాని 875, ఎంఇసిలో సిహెచ్.హర్షిత 866, బైపిసిలో కె.జ్ఞానేశ్వరి 963, సిఇసిలో ఎం.దివ్య 906 మార్కులు సాధించారు. విద్యార్థు లను మద్దాల రామప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి అభినందించారు.

ఉపాధి హామీ పనుల కల్పనపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి హామీ కూలీలకు ఉపాధి పనుల కల్పనపై ఉండి భీమవరం నియోజకవర్గాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణను ఉండి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, అసిస్టెంట్ పీడీ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా ఉపాధి కూలీల మస్తర్లు పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఉన్నత విద్య అందించాలి

గణపవరం :విద్యార్థులకు ఉన్నత విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గణపవరం ఎంఇఒ పి.శేషు అన్నారు. కాశిపాడు ఎంపిపి పాఠశాలలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ, నైపుణ్యాభివృద్ధి ప్రదర్శించినందుకు పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని 150 మంది విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో ఆయన చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకుని కంటి చూపును పొందాలని మొయ్యేరు గ్రామ సర్పంచి కుటుంబరావు అన్నారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 62 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ చెప్పారు. 62 మందికి కళజోళ్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, హెల్త్ విజిటర్స్ టివి.సుబ్బలక్ష్మి, సిహెచ్.వెన్నెల, ఎఎన్ఎం బి.రేవతికుమారి, ఎస్‌కె.సుల్తాన్ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, టి.నరసాపురం మండలం, మక్కినవారిగూడెంకు చెందిన నా భార్య అయిన నాళ్ళ హిమబిందు, D/o. వెంకట నారాయణ, Doc. No. 5239/92, తేది. 11-8-1992 గా గల దస్తావేజును ది. 19-3-2023వ తేదీన మక్కినవారిగూడెం నుండి టి.నరసాపురం వెళుతూ వుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు సమాచారం ఇవ్వగలరు.

సంకు వెంకట కేశవరావు
S/o. సర్వేశ్వరావు
సమ్మెటవారిగూడెం, చింతలపూడి మండలం
సెల్: 9542377497

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారు, తాడేపల్లిగూడెం
ఐ.ఎ. నెం. 471/2023
అందున
ఒ.ఎస్. నెం. 237/2011

మధ్య:
వాది: శ్రీ తమ్మినీడి ప్రసాదు
మరియు
ప్రతివాదులు: 1. శ్రీమతి తమ్మినీడి పద్మావతి
2. శ్రీ తమ్మినీడి సత్యన్నారాయణ
3. శ్రీ తమ్మినీడి వెంకటేశ్వర్రావు

పబ్లిక్ నోటీసు (శ్రీ కోర్టు వారి ఆనతితో)

యిందుమూలముగా పైన తెల్పిన మొదటి మరియు రెండవ ప్రతివాదులు/ రెస్పాండెంటులకు తెలియచేయునది ఏమనగా పైన తెల్పిన వాదిగారు అయిన ప్రసాదు గారు మీ పై దావా గ్రంధము పై నెంబరు కలది నెరపియుండగా మీరు అడ్వకేటు శ్రీ కొండేపాటి వెంకటేశ్వరరావు గారిని మీ తరపు వాదించుటకు వకీలుగా నియమితులను చేసియున్నారు. దావా గ్రంధము నడచుచుండగా మీ నుండి ఏవిధమైన స్పందన లేదని వారు మీ తరపు వాదించుటకు విముఖత చూపుచూ కోర్టునందు మీ నుండి ఏవిధమైన స్పందన లేదని కోర్టునకు విన్నవించుకొనియున్నారు.

కావున యిందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా సదరు దావా గ్రంధము వాయిదాను **03-05-2023న** కోర్టు వారు మీ స్పందన తెలుపుతూ మీరు ఖుద్దున గాని లేక విషయ పరిజ్ఞానం కలిగిన వకీలు ద్వారా గాని రాగలందులకు కోరియున్నారు. కావున పై తేదీన మీరు గాని లేక విషయ పరిజ్ఞానం కలిగిన వకీలు గారు ద్వారా వచ్చి మీరు వేయగల కాగితములను కోర్టున దాఖలు చేసుకొనగలరు. అటుల మీరు రాని పక్షాన మీ అభిముఖము లేకనే సదరు గ్రంధమును కోర్టు వారు సాగించెదరని యిందు మూలముగా తెలియచేయుచున్నాను.

యాళ్ళబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేది:26-4-23 6303018736

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, భీమవరం వారి కోర్టులో
O.S. No. 94/2022

Between:
శ్రీమతి ఉద్దరాజు సీతారత్నం వగైరాలు **-వాదులు**
V/s
గాదిరాజు కన్యాకుమారి మరియు వగైరాలు **-ప్రతివాదులు**

4వ ప్రతివాది: శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, W/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
5వ ప్రతివాది: కూనపరాజు కౌశిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
6వ ప్రతివాది: కూనపరాజు కార్తిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
(5 మరియు 6వ ప్రతివాదులు మైనర్లు అయినందున వీరి తరపున సంరక్షకురాలు తల్లి 4వ ప్రతివాది)

పై నెంబరు గ్రంథంలో 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్లకు అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది. 15-06-2023వ తేదీకి వాయిదా అయివున్నది. కావున 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్లు **ది. 15-06-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేటు గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల సదరు గ్రంధమును 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్ల పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
అడ్వకేట్, భీమవరం
ప్రాంతం: భీమవరం వాదుల తరపు అడ్వకేట్
తేది:27-04-2023 సెల్: 9848211102